


# దయ్యపు చూపులు

"మధు"

బిక్కు బిక్కు మంటూ చింత తోపుల నుండి ఇసుక మీదుగా సైకిలు త్రోసుకుంటూ నడుస్తున్నాను. బాటరీ లైటు వెలుతురు పడిన నాలు గడుగులూ దారి కనపడుతోంది. అంతే అంతా చీకటి గుయ్యారంలా ఉంది. తల ఎత్తేసరికి ఎదురుగుండా నేల మీద వ్రాలే కొమ్మలు తన వెనుక ఏదో ఉన్నట్లుగా కదులు తున్నాయి. అమావాస్యకు దగ్గరి రోజులేమో చీకటి విలయ తాండవం చేస్తోంది

ఉన్నట్టుండి భయంకరంగా అరుపు విప్పించింది పరధ్యానంగా ఉన్నానేమో అదిరిపోయి విలబడి మెల్లిగా దొంగ చూపులు చూడసాగాను. అటూ ఇటూ ఎదురుగా ఏదో నల్లగా కొనబడింది... వళ్ళంతా చెమట పట్టేసింది. బాటరీ లైట్ వేశాను వణుకుతూ ఓహ్... చింత చెట్టు మొదలు... రాక్షసిలా విస్తరించింది. ఆలోచిస్తూ ప్రక్కదారి పట్టాను చెట్టు అడ్డం వచ్చింది, అదే అలా అన్పించింది... కొంచెం ప్రక్కకు నడచి మళ్ళీపుంత పట్టాను సైకిలును గెంటుకుంటూ నడుస్తున్నాను. మళ్ళీ గుడ్లగూబ అరిచింది.

సాయంకాలం సరదాగా సినిమాకి వెళ్ళాను. మళ్ళీ వచ్చేసరికి అన్నయ్య నిద్రపోతున్నాడు. అమ్మ అన్నం పెట్టింది. తింటుంటే అంది. "మావయ్య సాయం రమ్మన్నాడుట్రా! ఇవాళ జీతగాడు రానన్నాడుట. అన్నయ్య వచ్చేక చెప్తే వాడు విన్ను పంపమని పడుకున్నాడు. వాడూ ఇందాకనే వచ్చాడు." అని నా మొఖంకేసిచూసింది. నా గుండెల్లో రాయి పడింది.

మామయ్యంటే అమ్మకి అన్నయ్య ఆయన ఊరి చివరిమూల ఇల్లు కట్టుకుంటున్నాడు. చివరి మెరుగుల్లో ఉంది నిర్మాణం. భార్యా పిల్లల్ని వారి పుట్టింట్లో ఉంచి తను దగ్గరఉండి ఇల్లు కట్టిస్తున్నాడు. రోజూ పనివాడు సాయం పడుకునేవాడు వాడు రాలేదట.

"మరిదిగారు భయపడతారేమోనండీ" అంది వదిన నన్నుద్దేశించి, ఉన్నమాటే అంది. మామయ్య ఇంటికి వెళ్ళాలంటే మూడు మైళ్ళ సైకిలు ప్రయాణం. ఆ తరువాత ఒక మైలు ఇసుక ప్రాంతలో సైకిలు త్రోసుకుంటూ నడకఆ పుంతలో కొంత దూరం వెళ్ళేసరికి చింత తోపు వస్తుంది. అక్కడికి సాధారణంగా ఎవరూ రాత్రి వెళ్ళరు. పనివాడు సాయంకాలం చెప్పి ఉంటాడు




దీర్ఘరోగులకు
ఉత్తమ వైద్యము
హస్తప్రయోగం, అవయవము చిన్నదగుట అవసరకాలమందు అసంతృప్తి. శుక్లనష్టము, నపుంసకత్వము, ఉబ్బసము (దమ్ము), బోదకాళ్ళు, కుష్టు, బొల్లి, చర్మ వ్యాధులు, కడుపునొప్పి, చెవుడు — పోస్టుద్వారా చికిత్స చేయబడును
శ్రీ బాలాజీ వైద్యశాల
డా॥ పి. కుమారస్వామి దేవర
టి. బి. రోడ్. తెనాలి.
ఫోన్ నెంబరు 551
బ్రాంచి: 8-డి. శివాజీ స్ట్రీట్, మద్రాసు-17

పంపించమని. ఆ వార్త నాకు యిప్పుడు అందింది.

"ఆ నాకు భయమేమిటి... అయినా..." అనే శాను పైకి.

"వాడికేమే మగమహారాజు, భయమేమిటి." అంది అమ్మ. అమ్మ కెంత నమ్మకం కుమారుని ప్రయోజకత్వం మీద. నవ్వుకున్నాను.

పుంత రెండుగా చీలింది. ఒకటి స్టేషనుకు పోతుంది. రెండోది మామయ్యగారింటికి పోతుంది. "ఇంకో అరమైలు పోతే వచ్చేస్తుంది! అని దారి పట్టాను.

"ఏమండీ' ఎవరిదో సన్నగా పిలుపు విని పించింది. వెనక్కి తిరిగి చూడటానికి భయం వేసింది. వణుకు వచ్చేసింది. ఇక్కడే అనుకుంటాను మొన్న సుబ్బారావుని' దెయ్యాలు పట్టుకున్నాయట. నాకు తలగ్రిరున తిరిగి పోయింది. అమ్మ...నాన్న. అన్నయ్య అంతా గుర్తుకొచ్చారు. రేపు పెళ్ళిచూపు లని వదిన అమ్మ చేసిన అట్టహాసం జ్ఞాపక మొచ్చింది. అయిపోతోంది... గుండె దడ దడా కొట్టుకుంటోంది.

"ఏమండీ! భయపడకండి. స్టేషను నుంచి వస్తున్నాను. రామాపురం వెళ్ళాలని వచ్చాను." ఇంచు మించు నా ప్రక్కకు వచ్చేసింది ఆ ఆకారం. తెల్లచీర కట్టుకున్న స్త్రీ ఆకారం కన్పించింది నాకు లీలగా. బాటరీకాంతిమీద వేయటానికి ధైర్యం చాలలేదు.

'స్టేషనుకి ఇప్పుడు వచ్చే రైలు ఏమీలేదు. ఇది నిజంగా దెయ్యమే. శ్రీ ఆంజనేయం... ప్రసన్నాంజనేయం...' గుండె దడాదడా కొట్టుకుంటోంది. చిన్నప్పుడు వద్దన్నా ఆంజనేయదండకం చదివించే తాతయ్య జ్ఞాపకంవచ్చారు. ఇంకెంత సేపు... తాతగార్ని కలుసుకోబోతున్నాను.

"దండకం చదివేస్తున్నారేమిటి? నేను మనిషినే నండీ! సాయంకాలం ఐదు గంటలకు రావలసిన ట్రెయిన్ ఇప్పుడు వచ్చింది నాలుగ్గంటలు లేటు సాయంకాలం అమాత్రం ఇంటికి వెళ్ళలేకపోతానా అని ధైర్యంగా బయలుదేరాను. ఈ టైమ్‌లో తోవలోనుండి ఇంటికి వెళ్ళడానికి ధైర్యం చాలటంలేదు, ఈరాత్రి ఇక్కడే ఎవరింట్లోనైనా గడిపి ప్రొద్దున్నే వెళదామని అలా వస్తున్నాను. ఇంతలో దేవుళ్ళా కనిపించారు. మీయిల్లు ఇక్కడేనానండీ?" కంఠం కమ్మగా వినిపించింది.

నా పరిస్థితి నాకే అర్థమవటంలేదు, బాటరీలైటు వెలుతురు ఆమె పాదాలమీద పడింది. పాదాలు ఎర్రగా మెరుస్తున్నాయి. నడకమూలాన్ని కంది పోయినట్లున్నాయి, పల్చటి జోళ్ళు తొడుక్కున్నట్లుంది. దెయ్యాలకు పాదాలు వెనుదిరిగిపోయి ఉంటాయని చిన్నప్పుడు తాతయ్య చెప్పారు. మళ్ళి తాతయ్య జ్ఞాపకం వచ్చారు.

"మాట్లాడరేమండీ...ఏదేనా చెప్పండి మీరేం మాట్లాడకపోతే నాకు భయం వేస్తోంది. ఇక్కడ దయ్యాలుంటాయేమోనని......" మాట్లాడటానికి భయంవేసి కాబోలు ఆపేసింది.

కాలేజిలో అమ్మాయిలతో ఎంతో కులాసాగా సరదాగా మాట్లాడే వాడు తను. కాలేజీ హీరో అని పేరుతెచ్చుకున్న తనేనా మాట్లాడలేక పోతున్నాడు. ఇంతకీ ఈమె మనిషా...దయ్యమా? నా ఆలోచనలు నాకే భయం కలిగిస్తున్నాయి.

"ఏం...ఏం...మాట్లాడను..." ఎలాగో అనే శాను. పక్కున నవ్వింది ఇంతి.

"ఆడవాళ్ళకంటే అద్వాన్నంగా ఉన్నారేమిటండీ చీకటిలో ఎవరూ లేనిచోట అందమయిన అమ్మాయితో మాట్లాడటానికి మాటలు లేవంటే నిజంగా నాకు ఇన్సల్ట్‌గా ఉంది, మీరసలు పురుషులేనా?"

ఛెళ్ళున కొట్టినట్లుగా ఉంది ఆ వ్యాఖ్యానం ఎంత అవమానకరం. దెయ్యమైనా మనిషయినా సరే జరిగేది జరక్క మానదు. భయపడితే దెయ్యాలు మరీ ఏడిపిస్తాయట, అందుకనే తెగించాను.

"ఎంత అందమయిన అమ్మాయి అయినా వంటరిగా చీకట్లో ఎదురొచ్చి ఇంత అందంగా మాట్లాడేస్తుంటే ఉక్కిరి బిక్కిరి అయిపోయిన మగాడు ఏం మాట్లాడతాడండీ," అన్నాను.

"ఫర్వాలేదే బాగానే మాట్లాడుతున్నారే ... మీ పేరేంటి"

"రాజు అన్నాను ఏం మాట్లాడటానికి తోచక.

"ఇంతకీ మీ యిల్లు ఇక్కడేనా?" మెల్లిగా అడిగింది ఆమె.

చెప్పాను. చాలాసేపు మాట్లాడలేదు. మా మామయ్యగారిల్లు దగ్గరకు వచ్చేస్తోంది. రెండు మూడిళ్ళు దాటాము

"ఇంతకీ నేను రావచ్చండీ, ఏమయినా అభ్యంతరముందా?" అని అడుగుతోంది ఆమె. నేనేం మాట్లాడలేదు ఇప్పుడు మామయ్య ఇద్దర్నీ చూసి ఏమనుకుంటాడో, కోరి కోరి ఈ దయ్యాన్ని వెంట తెచ్చానేమిటి నన్ను నేనే తిట్టుకున్నాను. మామయ్య ఇంటి దగ్గరకు వచ్చేశాము. పెద్ద ఇల్లేమో ఎక్కడో చిన్న దీపం వెలుగుతోంది. గుమ్మం దగ్గరకు వచ్చేశాము.

"మీరు కొంచెం ప్రక్కగా నిల్చోండి" అన్నాను. ధైర్యంగా ఏమనుకుందో చాటుగా నిల్చుంది.

మామయ్య వచ్చి తలుపు తీశాడు. లోపలికి వెళ్ళాను. మామయ్య అప్పుడే నిద్రపోతూ లేచినట్లున్నాడు తూలు తున్నాడు.

"ఏరా రాగలిగావా చీకటిలో" అన్నాడు నన్ను చూస్తూనే నేం మాట్లాడలేదు. 'సరే! ముందుగదిలో మంచం వేసాను. పడుకో" అని తను వెళ్ళిపోయాడు. నేను బయటికి వచ్చాను. ఇంకా నిల్చునే ఉంది, రమ్మన్నాను నాలో కంక పీడిస్తోంది లోపలికి వచ్చింది, ఆమెను చూడగానే నా కళ్ళు తేలిపోయాయి.

తెల్లని పొడుగు చేతుల జాకెట్ వేసుకుంది. తెల్ల చీరమీద చిన్న చిన్న పూవులున్నాయి. ఎర్రని పెదవులు, గులాబీ బుగ్గలు, చిన్న బొట్టు, ఒక చేతికి వాచీ, ఒక చేతికి ఒక గాజు, అందమంతా మూర్తీభవించిన దేవతలా కనిపించింది. చేతిలో చిన్న సూట్‌కేస్ ఉంది.

"అదేమిటండీ! అలా చూస్తున్నారు.' అంది ఆమె. కళ్ళలో గర్వరేఖలు తొంగిచూస్తున్నాయి.

మామయ్య చూడకపోవడం ఒకటి మేలు జరిగింది. ఆమెకు వేరే పక్కవేసి పడుకోమన్నాను. రాత్రంతా నాకు భయంగానేఉంది. తెల్లారేసరికి ఏమవుతుందో అని గుండె దడదడలాడుతూనేఉంది, అలా ఎప్పుడు నిద్రపోయానో లేచేసరికి ఏడయింది. ఆమె పడుకున్న చోటు చూశాను. ఎవరూ లేరు. ప్రక్క అంతా వేసింది వేసినట్లుగానేఉంది. నాకు భయంవేసింది. పక్కమీద ఏదో కాగితం ఎగురుతోంది. తీశాను.

రాజుగారూ!

మీ జంగారు నాకు తెలుసు. మీ మామయ్యగారు చూడకుండా వెళ్తున్నాను. ఏమనుకోకండి. మళ్ళీ వీలుంటే కలుద్దాము.

దేవకి.

ఉత్తరం చదివేసరికి నా అనుమానం ధృవపడింది. పగలు దయ్యాలు కనిపించవు గదా! రాత్రికి రాత్రే తెలియకుండా ఉడాయించి ఉంటుంది. తను ధైర్యంగా ప్రవర్తించటం మంచిదే అయింది. పారిపోయింది దయ్యం అనుకున్నాను.

* * *

ఇంతకీ అది దయ్యమేనంటావా?" అనడిగాడు రామారావు నన్ను.

"ఆ దెయ్యమే నా భార్య" అన్నాను నేను. "ఆ! అని నోళ్ళు తెరిచేసారు రామారావు, శంకరూను." అవునురా ఆ పిల్ల చౌదరిగారమ్మాయట మేము చూపులకని వెళ్ళాము వాళ్ళింటికే ఆ దయ్యమే పెళ్ళికూతురై కూచుంది" అన్నాను.

"అయితే నీ మొదటి చూపులు దయ్యపు చూపులన్న మాట" అని నవ్వాడు శంకరం, నేనేం మాట్లాడలేదు "అదుగో ఊరు దగ్గర పడుతోంది" అన్నాను నేను దూరంగా దీపాలు చూస్తూ. చీకటిని చీల్చుకుంటూ ముందుకు సాగాము.